క్లుప్తంగా

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి పూల మొక్క అందిస్తున్న షన్వితరెడ్డి

పటాన్‌చెరు టౌన్: జూనియర్ నేషనల్ టెన్నిస్ క్రీడాకారిని షన్విత రెడ్డి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూల మొక్క అందించి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో రాణించి, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు

సాయిబాబా పల్లకీసేవ



పల్లకీసేవలో నిర్వహిస్తున్న భక్తులు

నారాయణఖేడ్: పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పల్లకీసేవ, మహాహారతి చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

నగర సంకీర్తన



నగర సంకీర్తనలో భజన చేస్తున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం నగర సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్ని భజనలు, కీర్తనలతో భగవంతుడిని కీర్తించారు. మహిళలు, పట్టణ ప్రముఖులు, వైద్యులు, వ్యాపారులు, ఉద్యోగులు ఉన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు



విద్యార్థులకు బోధిస్తున్న జైపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: మండలంలోని ర్యాకల్ జెడ్పీ హెచ్‌ఎస్ విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను నిర్వహించారు. ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు జైపాల్‌రెడ్డి ఆదివారం ఉదయం 8 నుంచి 9.30గంటల వరకు విద్యార్థులకు బోధించారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఇంగ్లిష్ భాషపై విద్యార్థులు పట్టు సాధించాల్సిన అవసరం ఉందని, విద్యార్థులు తరగతులను సద్వినియోగం చేసకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బి.రాజ్ కుమార్ తెలిపారు. అనంతరం రాజ్‌కుమార్, జైపాల్‌రెడ్డిని పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, శాలువాతో సన్మానించారు.

తల్లిదండ్రుల సమాధులకు పూజలు



పూజలు చేస్తున్న నిర్మలా జగ్గారెడ్డి

మునిపల్లి(అందోల్): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి తల్లిదండ్రుల సమాధులకు ఆదివారం పూజలు నిర్వహించారు. మండలంలోని తాటిపల్లి గ్రామంలో నిర్మల జగ్గారెడ్డి తల్లి దండ్రులు కోవూరి దుర్గయ్య గౌడ్, దుర్గమ్మల పెద్దకొడుకు నర్సింహ్మాగౌడ్ ఆధ్వర్యంలో వారి సమాధుల వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో జయారెడ్డి, మంజుల, కుటుంబ సభ్యులున్నారు.

ప్రమాదకరంగా వంతెన



సైడ్‌వాల్ లేని వంతెన

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మెల్లూర్ నుంచి కొప్పులపల్లి వైపు వెళ్లే దారిలో ఉన్న వంతెనపై సైడ్ వాల్స్ నిర్మించలేదు. దీంతో ఇరుపక్కల ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారి నుంచి మూలమలుపులో ఉన్న వంతెనపై ఆదమరిస్తే వాహనదారులు ప్రమాదానికి గురై కాలువలో పడే పరిస్థితి నెలకొంది. ఈ విషయంలో అధికారులు స్పందించి, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయాలకు వైకుంఠ శోభ



విద్యుత్ కాంతులీనుతున్న వైకుంఠపుర ఆలయం



సంగారెడ్డి టౌన్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా సంగారెడ్డి పట్టణ శివారు వైకుంఠపురం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో శోభాయామానంగా అలంకరించారు. ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లను చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం 5గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులకు అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. లక్ష మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అందుకు తగినట్లుగా ఏర్పాట్లను పూర్తి చేసామని ప్రధాన అర్చకుడు కందాడై వరదచార్యులు వివరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వాహనాలను నిలపడానికి ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం కల్పించామని, భక్తులు క్యూలైన్ పాటిస్తూ నిర్వాహకులకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



పడిపూజకు హాజరైన కార్పొరేటర్ సింధు

మహా పడిపూజలో కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్ చెరు): భారతి నగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీలో ఆదివారం జరిగిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో కార్పొరేటర్ సింధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం (పటాన్ చెరు): ఆలయాలు, ప్రార్థన మందిరాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మైపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్‌లోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించిన జాతరలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా మల్లికార్జున స్వామి జాతరను ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. మల్లన్న దేవుడి ఆశీస్సులతో నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ లలితా సోమిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, వైస్ చైర్మన్ మల్లారెడ్డి, పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, కౌన్సిలర్ శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



జాతరలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

కేకుల పంపిణీ

పటాన్‌చెరు: నూతన సంవత్సరం సందర్భంగా ఎండీ సలీం, సాత్విక్ అందించిన 400ల కేకులను ఆదివారం పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాయికాడి విజయ్ ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటి చైర్మన్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాపడిపూజ

నారాయణఖేడ్: పట్టణంలోని సాయిసంజీవని ఆస్పత్రి ఆవరణలో ఆస్పత్రి నిర్వాహకులు డా.పి.జగన్మోహన్ ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్పస్వామి మహాపడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, అఖిల భారత సాధు సంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్, కల్హేర్ జెడ్పీటీసీ నర్సింహ్మారెడ్డి తదితరులు హాజరై పూజలు నిర్వహించారు. నాయకులు ఆస్పత్రి నిర్వాహకులు శాలువాతో సన్మానించారు.



ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర



జాతరకు హాజరైన భక్తులు

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని హత్నూర గ్రామ శివారులోని మల్లన్న గుట్టల్లో భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన నిర్వాహకులు మధ్యాహ్నం అగ్నిగుండాలు, కళ్యాణం సాయంత్రం బోనాలు, బండ్ల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాలలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగాయిపల్లి గోపి, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్, సర్పంచ్ వీరస్వామి గౌడ్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వాల్దాస్ మల్లేశం గౌడ్, నాయకులు పెంటేష్, నాగు ప్రభు గౌడ్, రాజు, రవి, ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



సంగారెడ్డి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



జిన్నారం(పటాన్‌చెరు): చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న కౌన్సిలర్ చంద్రారెడ్డి

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల చర్చిల్లో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు దైవ సందేహాన్ని అందించగా, భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అందరూ కలిసి కేక్ కట్ చేసి ఒకరికొకరు కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మహర్ శౌర్య విజయ దినోత్సవం

జహీరాబాద్ టౌన్: సమతా సైనిక్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం మహర్ శౌర్య 205వ విజయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అతిథి గృహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కోరేగావ్ యుద్ధంలో మహర్ సైనికులు చూపిన ధైర్య సాహసాలను కొనియాడారు. వారు చూపిన ధైర్య సహసాలను నేటి యువత కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ నాయకులు, సామాజిక ఉద్యమకారులు, ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విజయ దినోత్సవంలో ప్రజా సంఘాల నాయకులు

క్రీడాకారుడికి సాయం



ధనుష్‌ను అభినందిస్తున్న సీఐ

పటాన్‌చెరు టౌన్: నేషనల్ క్రాస్ కంట్రీ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడికి పటాన్‌చెరు సీఐ ఆర్థిక సాయం అందించారు. నల్గొండ జిల్లా నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన ధనుష్ అస్సాం రాష్ట్రం గుహవాటిలో ఈ నెల 7, 8 తేదీల్లో జరగబోయే పోటీలకు ఎంపికయ్యాడు. పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా స్పందించిన సీఐ వేణు గోపాల్ రెడ్డి విమాన టిక్కెట్, హోటల్ ఖర్చులకు సాయం అందించారు.

భట్రాజుల ఐక్యత చాటాలి

సంగారెడ్డి టౌన్: హక్కుల సాధనకు భట్రాజుల కులస్తులు ఐక్యతతో ఉండాలని రాష్ట్ర భట్రాజుల సంఘం ఉపాధ్యక్షుడు నంది భట్టు నర్సింహ్మారాజు కోరారు. ఆదివారం సంగారెడ్డి పట్టణంలో ఇంటింటా వెళ్లి సభ్యత్వాన్ని నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి భట్రాజుల సమస్యలపై చర్చిస్తామన్నారు, బిరుదరాజు రామరాజు, మధుసూదన్ రాజు, ప్రభాకర్ రాజు, నరేందర్ రాజు, రిటైర్డ్ టీచర్ లక్ష్మణ్ రాజు, శ్రీనివాస్ రాజు, పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ 3న సిర్గాపూర్ మండల సమావేశం

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల పరిషత్ సమావేశాన్ని మంగళవారం ఎంపీపీ జె.మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుజాత ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, సమావేశానికి ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమయానికి హాజరు కావాలని కోరారు.

◆ నేడు రామలింగేశ్వర ఆలయంలో పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నందికంది గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

◆ లక్ష దీపోత్సవంలో పాల్గొనాలి

మునిపల్లి(అందోల్): టేక్మాల్ మండలం వెల్పుగొండపై శ్రీ సీతారామ ఆలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించే లక్షదీపోత్సవానికి భక్తులు హాజరు కావాలని ఆత్మానందాశ్రమ అధ్యక్షుడు గుర్రాల భానుప్రకాష్ తెలిపారు. రుస్తుంపేట ఆత్మానందాశ్రమ పీఠాధిపతి భగవద్భక్త పరాగ పూజ్య పాద గురురాజయోగి వెంకటస్వామి అధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తామని, ఉదయం లక్ష పుష్పార్చన, తులసి అర్చన, శ్రీ సీతారాముల దేవతామూర్తులకు అభిషేక కార్యక్రమం ఉంటుందన్నరాఉ. దీపోత్సవ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

◆ మృతుడి కుటుంబానికి పరామర్శ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మాజీ సర్పంచ్, ఎండీఆర్ ఫౌండేషన్ స్థాపకుడు దేవేందర్ రాజు సోదరుడు విక్రమ్ రెడ్డి గత ఆదివారం రాత్రి గుండె పోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు శనివారం మృతుడి కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించారు. మృతుడి తండ్రి మాజీ జెడ్పీటీసీ జైపాల్‌కు ఫోన్ చేసి ధైర్యంగా ఉండాలన్నారు.

◆ నేడు ప్రత్యేక కార్యక్రమాలు

నారాయణఖేడ్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఖేడ్ శ్రీరామమందిరంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. ఉదయం 5.55గంటలకు ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. సుప్రభాత సేవ, అభిషేకం, ద్వారపూజ, హారతి, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం సిర్గాపూర్ మండలం పోట్‌పల్లిలో కాంగ్రెస్ నాయకులు తుక్కరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వార్డు సభ్యులు, తదితరులు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నిజాంపేట మండలం బాచేపల్లిలో ఎస్సీ కమ్యూనిటీ భవనం ప్రారంభించి భూపాల్‌రెడ్డి మాట్లాడారు. కులం, మతం పేరిట రాజకీయం చేసే వారిని ఉపేక్షించవద్దని, ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తున్న నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ ఇతర పార్టీల నేతలు ఒక్కటైనా, ప్రజల ఆశీర్వాదంతో బీఆర్‌ఎస్ తరపున ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు మహిపాల్‌రెడ్డి, గుర్రపు సుశీల, జెడ్పీటీసీలు రాఘవరెడ్డి, నర్సింహరెడ్డి, వైస్ ఎంపీపీలు నారాయణరెడ్డి, ప్రయగబాయి మాధవరావు, మాజీ ఎంపీపీ పద్మ, సర్పంచ్‌లు సంజీవరెడ్డి, రవీందర్ పాటిల్, గంగబాయి, పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, నాయకులు ఈశ్వర్ పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావుకు ప్రజాప్రతినిధుల శుభాకాంక్షలు



పూల మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్

జహీరాబాద్ టౌన్: తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్ తదితరులు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో మంత్రికి పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎంజీ.రాములు, శివకుమార్ తదితరులు ఉన్నారు.

పటాన్‌చెరు టౌన్: నూతన సంవత్సరం సందర్భంగా పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పలువురు ప్రజాప్రతినిధులను ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్‌తో కలసి మంత్రి హరీశ్ రావు, పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, మేయర్ విజయ లక్ష్మిని కలసి పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఇటుక బట్టీలతో ఇబ్బందులు



జిన్నారంలో రోడ్డు పక్కన ఇటుక బట్టీ

- రోడ్ల పక్కన బూడిద దిబ్బలు
- దుమ్మూధూళితో స్థానికుల ఇక్కట్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

జిన్నారం(పటాన్‌చెరు): ఇటుక బట్టీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై వెళ్తున్న వాహనదారులు దుమ్మూధూళితో సతమతమవుతున్నారు. దుమ్ము కారణంగా రోడ్లపై ఎదురుగా వాహనాలు కనిపించకపోవటంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. జిన్నారం నుంచి అన్నారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ప్రజలు వెతలు చెప్పనలివి కావడం లేదు. జంగంపేట, అన్నారం గ్రామాల పరిధిలోని ప్రధాన రహదారికి ఇరువైపులా 20కిపైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. అక్రమంగా మట్టిని తరలిస్తుండటంతో రోడ్లపై మట్టి కుప్పలు పేరుకుపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏడాదికాలంగా ఈ సమస్య ఉన్నా ఇక్కడి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవటం లేదు. గ్రామపంచాయతీ అధికారులు, రోడ్లపై వస్తున్న వాహనదారులు దుమ్ముతో ఇబ్బంది పడటంతో పాటు గుంతలమయంగా రోడ్లు మారటం కూడా తీవ్ర సమస్యగా మారింది. స్థానిక ప్రజాప్రతినిధులు ఇటుక బట్టీల యాజమాన్యాలతో కుమ్మక్కయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

వేరే చోటుకు తరలించాలి

ఇటుక బట్టీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై దుమ్ముతో ఇబ్బంది పడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. దుమ్ముతో రోడ్డు పక్కన నుంచి వెళ్లేప్పుడు ఇబ్బందిగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వీటిని వేరే చోటుకు తరలించాలి.

– శ్రీనివాస్, వాహనదారుడు, అన్నారం